క్లుప్తంగా

కొబ్బరి గోడౌన్ దగ్ధం


కాలిపోతున్న కొబ్బరి గోడౌన్

మామిడికుదురు: పెదపట్నంలంకలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కొమ్ముల శ్రీనివాస్‌కు చెందిన కొబ్బరి గోడౌన్ దగ్ధమైంది. గోడౌన్‌లోని రెండు పోర్షన్లలో నిల్వ ఉంచిన సుమారు 4 లక్షలు కురిడీ కొబ్బరి కాయలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సహకారంతో ఓఎన్‌జీసీతో పాటు రాజోలు నుంచి ఫైరింజన్లను రప్పించి, మంటల్ని అదుపు చేశారు. ప్రమాదం ఏవిధంగా జరిగిందన్న దానిపై స్పష్టత లేదు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం జరిగిందని రాజోలు అగ్ని మాపక కేంద్రం అధికారులు అంచనా వేసినట్టు వీఆర్‌ఓ అప్పన బాలాజీ తెలిపారు.

కొత్తపేట హెచ్‌ఓగా కోటేశ్వరరావు



కొత్తపేట: ఉద్యాన శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అధికారి(హెచ్‌ఓ)గా గంటా కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ హెచ్‌ఓగా పని చేసిన ఎం.అనూష రామచంద్రపురం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కోటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన కోటేశ్వరరావు ఎమ్మెస్సీ హార్టికల్చర్ చదివి, హార్టికల్చర్ పీహెచ్‌డీ చేశారు. అనంతరం రెండున్నర సంవత్సరాల పాటు అంబాజీపేట కొబ్బరి పరిశోధన స్థానంలో హార్టికల్చర్ పరిశోధనా సహాయకునిగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేశారు. ఏపీపీఎస్సీ పరీక్ష రాసి, హెచ్‌ఓగా ఎంపికై, కొత్తపేటలో తొలి పోస్టింగ్ పొందారు. కొబ్బరి పరిశోధన స్థానంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా ఉన్న అనుభవాన్ని జోడించి, సబ్ డివిజన్‌లో ఉద్యాన పంటల విస్తీర్ణం, పంటల సాగు పద్ధతులపై అవగాహన చేసుకుని, అధిక దిగుబడులు సాధించేలా రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తానని కోటేశ్వరరావు 'సాక్షి'కి చెప్పారు.

20న అయినవిల్లిలో బీజేపీ సభ

కొత్తపేట: ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 20న అయినవిల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు విళ్ల దొరబాబు, రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి పాలూరి జయప్రకాష్ నారాయణ తెలిపారు. ఈ సభకు అనుమతి కోరుతూ డీఎస్పీ కేవీ రమణకు వారు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల మోదీ పాలనను వివరించేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో మాజీ కేంద్ర మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందరేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అల్లు భాస్కరరావు, అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడుపూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్రేయపురం: ఇటీవల తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను వెలిచేరు గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ కోనసీమ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజులపూడి భీముడు తదితరులు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారికి తమ సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈతకోట సబ్ స్టేషన్ ఏఈగా సురేష్



రావులపాలెం: ఈతకోట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈగా కె.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగం నుంచి బదిలీపై ఆయన ఈతకోట వచ్చారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి టి.నరసింహాచార్యులు (భీమవరం) రూ.25,011, యు.నాగ సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మి దంపతులు (మూలస్థానం) రూ.10,021 చొప్పున విరాళాలు సమర్పించారు. దాతలకు ఆలయ పర్యవేక్షకుడు ఆర్.శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోండి

అయినవిల్లి: మండలంలోని మాగాం తదితర గ్రామాల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు గురువారం పలువురు ఫిర్యాదు చేశారు. అక్రమ మట్టి తవ్వకాలతో పక్క రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

పోషకాల గని.. నేరేడు

- వేసవిలోనే లభించే ఫలం
- లంకల్లో విరివిగా లభ్యం
- కిలో రూ.200కు విక్రయం

అలమూరు: కరోనా తరువాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై స్పృహ పెరిగింది. ఫలితంగా తాజా ఆకు కూరలు, కూరగాయలతో పాటు పండ్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సాధారణంగా వేసవిలో లభించే మధుర ఫలం మామిడి అంటే అందరికీ ఇష్టమే. కానీ, ఇంచుమించు ఇదే సీజన్‌లో అంటే జ్యేష్టం నుంచి శ్రావణ మాసం వరకూ లభించే పండు నేరేడు. ఈ చెట్లను చాలా మంది ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో పెంచుతారు. అలాగే, గోదావరి పరీవాహక ప్రాంతాలు, లంక భూముల్లో ఈ చెట్లు విరివిగా ఉన్నాయి. అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని మన్యం, చాగల్నాడు ప్రాంతాల్లో కూడా నేరేడు పండ్లు అధికంగా లభిస్తాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో ఈ పండ్లు మార్కెట్‌లో విస్తృతంగా కనిపిస్తున్నాయి. రైతు వద్ద దళారులు కేజీ రూ.80 చొప్పున


నేరేడు పండ్లు

కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారులు వీటిని వినియోగదారులకు కిలో రూ.200 వరకూ అమ్ముతున్నారు. నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి, వాటిని మరింత లాభసాటి ధరకు విక్రయిస్తున్నారు.

రుచిలో మేటిగా ఉండే నేరేడు పండుకు పోషకాల గనిగా పేరుంది. సక్రమంగా వినియోగించుకుంటే ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. పండు మాత్రమే కాదు.. ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. నేరేడు పండుతో ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు కూడా తయారు చేస్తుంటారు. నేరేడు కాయలను వెనిగర్, మద్యం తయారీలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం నేరేడు పండు ఎన్నో ఔషధ లక్షణాలు కలిగి ఉంది. వేసవిలో ప్రతి రోజూ కనీసం ఒక్క నేరేడు పండు తింటే వ్యాధులకు, అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు విటమిన్–ఎ, సి పుష్కలంగా ఉంటాయి. దీనివలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయ పని తీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పని చేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి, దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకు పోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.


నేరేడు చెట్టు కొమ్మకు విరగ కాసిన కాయలు, పండ్లు

మితిమీరి తింటే దుష్ఫలితాలు

- నేరేడు పండ్లు మితిమీరి తింటే దుష్ఫలితాలు ఎదురవుతాయి. వగరు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లు తింటే గొంతు నొప్పి రావచ్చు. సీజన్ మారే సమయంలో ఈ పండ్లను మితంగానే తినాలి.
- ఉబ్బసం బాధితులు ఈ పండ్లు ఎక్కువగా తిన రాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణ వ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.

ఖనిజ లవణాలు పుష్కలం



నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. దీనివల్ల శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించవచ్చు. అన్ని వేళల్లో ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది.
– పి.భవానీ శంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల, ఆలమూరు మండలం

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

అలమూరు: మండలంలో రీసర్వే పూర్తయిన భూములకు ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ ఎస్.శేఖర్‌బాబుతో కలిసి పెదపళ్ల గ్రామ సచివాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ సేవలను వారు ప్రారంభించారు. తొలి రిజిస్ట్రేషన్ పత్రాన్ని గొడవర్తి కృష్ణారావుకు అందజేశారు. మండలంలోని జొన్నాడ, సంధిపూడిలో రీసర్వే పూర్తయిన తరువాత మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రిజిస్ట్రేషన్లు సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

బాల్య దశలో ప్రేరణతోనే వ్యక్తిత్వ వికాసం

కొత్తపేట: బాల్య దశలో కలిగించే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ పి.శారద అన్నారు. మండలంలోని వాడపాలెం మారెమ్మ మాన్యం, వానపల్లి నారాయణపురం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గురువారం 'జన్ భాగిదారి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో డెవలప్‌మెంట్ కార్నర్ ఏర్పాటు చేసి, డిపార్ట్‌మెంట్ సరఫరా చేసిన ప్రీ స్కూల్ కిట్ పిల్లల సమగ్రాభివృద్ధికి ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. పీపీ–1, పీపీ–2, వర్క్ బుక్స్, యాక్టివిటీ, స్పోకెన్ ఇంగ్లిషు పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించడం, తల్లుల సమూహాల ఏర్పాటుపై సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- లూటుకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. లూటుకుర్రులో ఆయన గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అన్ని వర్గాలకూ మేలు జరిగే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రభుత్వం ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టిబాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా కుమారి, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలుకు సత్కారాలు

- నియోజకవర్గ స్థాయి టాపర్లకు బహుమతులు
- అందించిన ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు
- చదువుల్లో మరింత రాణించాలని విద్యార్థులకు పిలుపు


అంబాజీపేటలో సత్కారం అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు


బట్టేలంకలో విద్యార్థినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు


రావులపాలెంలో పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ, చదువుల్లో మరింత రాణించాలని విద్యార్థులకు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చూపి, నియోజకవర్గ టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో గురువారం వివిధ ప్రాంతాల్లో సత్కరించి, బహుమతులు అందజేశారు.

పి.గన్నవరం నియోజకవర్గం టెన్త్ టాపర్లకు అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంబాజీపేటలో 10 స్వర్ణం, 9 రజతం, 9 కాంస్యం; మామిడికుదురు 13 స్వర్ణం, 13 రజతం, 14 కాంస్యం; అయినవిల్లి 11 స్వర్ణం, 11 రజతం, 11 కాంస్యం; పి.గన్నవరం 18 స్వర్ణం, 14 రజతం, 16 కాంస్య పతకాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు, ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులకు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు మోకా ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు, కసిరెడ్డి అంజిబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీ భార్గవి, ఎంపీటీసీ సభ్యుల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంఈఓలు ఎస్‌జేవీ కనకదుర్గ, కోన హెలీనా తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు

మలికిపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పోటీతత్వం పెంచి, మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను పోత్సహించేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బట్టేలంక ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 33 పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ మంచి ఫలితాలు సాధిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపీపీలు మేడిచర్ల వెంకట సత్యవాణి, వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్న కుమారి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యకు పెద్దపీట

రావులపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేయడంతో పాటు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారని కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట నియోజకవర్గ స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ ఆధ్వర్యాన స్థానిక సెయింట్ పాట్రిక్ స్కూల్‌లో నిర్వహించారు. నియోజవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సయ్యపరాజు వివేక్ సాయితేజ్ వర్మ, దండు షణ్ముఖి సాయి కృష్ణప్రియ (వెదిరేశ్వరం హైస్కూల్), తృతీయ స్థానం సాధించిన చెందిన పుల్య కుమారసాయి శ్రీరూపిత(రావులపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాల)లను స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, నగదు బహుమతులతో సత్కరించారు. అలాగే నియోజకవర్గ కళాశాల స్థాయిలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ప్రథమ స్థానం సాధించిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సుంకర జ్యోతి, శీలం లక్ష్మీ ఐశ్వర్య, ఉంగరాల భవాని, మగపు గోపాలకృష్ణలను బంగారు పతకాలు, నగదు బహుమతులతో సత్కరించారు. ఆయా పాఠశాల హెచ్‌ఎంలు సుభాకర్‌రెడ్డి, కె.సువర్ణకుమారి, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సీతామహాలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఆర్‌డీఓ ముక్కంటి, ఎంఈఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన సీఎం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- కేశనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

మలికిపురం: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని బట్టేలంక గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి, వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై నేరుగా ఆరా తీశారు. అర్హులకు పథకాలు అందకపోతే కారణాలు అడిగి తెలుసుకుని, సంబంధిత వలంటీర్లు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ల సాయంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తికెక్కారని అన్నారు. ప్రభుత్వం అంటే


ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ప్రజల కోసం పని చేయడమేనని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. గత ప్రభుత్వాల పని తీరును, ప్రస్తుత సీఎం జగన్ పని తీరును బేరీజు వేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలు లేనిపోని బురద జల్లేందుకే ప్రయత్నిస్తున్నాయని, ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే రాపాక కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అలమూరు: ఇటీవల మడికిలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన జాస్తి బాబూరావు కుటుంబానికి నియోజకవర్గ కాకతీయ కమ్మ మహాజన సంఘం ఆర్థిక సాయం అందించింది. సేకరించిన విరాళాలతో పాటు సొంత నిధులు కలిపి మొత్తం రూ.3.70 లక్షలను సంఘం గౌరవాధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, స్థానిక నేతలు కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన బాధితుని భార్య ఇందిర యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దొడ్డపునేని త్రినాథరావు, గుణ్ణం రాంబాబు, వంటిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

అలమూరు: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చెముడులంకలో గురువారం పౌష్టికాహార కిట్లను సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ పంపిణీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణకు అమలు చేస్తున్న పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతిసార నియంత్రణపై అవగాహన

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సంభవిస్తున్న ఉధృత అతిసార నియంత్రణపై వివిధ గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కొత్తపేట అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలానాయుడు నేతృత్వంలో సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వరరావు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు, మలేరియా నిర్మూలన మాసోత్సవాలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం నగరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మామిడికుదురు, నగరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.

రైల్వే బ్రిడ్జి పనుల పరిశీలన

మామిడికుదురు: కోటిపల్లి – నర్సాపురం రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల్ని బీజేపీ నేతలు గురువారం పాశర్లపూడిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం తదితరులు మాట్లాడారు. రూ.2,050 కోట్లతో ఈ రైల్వే లైను నిర్మాణం చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం ఇవ్వాల్సి ఉందని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం తాళ్లమ్మ గుడి సమీపాన రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదర్శ పాలన సాగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

అంబాజీపేట: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. మండల అధికారులందరూ వివరాలతో హాజరు కావాలని కోరారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ధ్యేయం

ఆలమూరు: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు సంపూర్ణ మద్య నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆలమూరు ఎస్‌ఈబీ సీఐ సీహెచ్ అరుణమ్మ తెలిపారు. డ్రగ్స్, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక వినాయక గుడి కూడలిలో గురువారం ఆమె అవగాహన కల్పించారు. 'డ్రగ్స్ రహిత సమాజం–సంక్షేమానికి సంకేతం' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలను ఇప్పటికే పూర్తిగా అరికట్టామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సత్వరమే ఎస్‌ఈబీకి సమాచారం అందించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఈబీ ఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుంగ ఆంజనేయస్వామి భూములపై విచారణకు కమిటీ

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగ గ్రామంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూములపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వెలిచేరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ ఎ.సత్యవర్ధనరావు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానికియమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్‌లతో ఈ విచారణ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఈ భూములపై ×సాక్షి౯ ప్రచురించిన వరుస కథనాలకు దేవదాయ, ధర్మదాయ అధికారులు స్పందించారు. ఈ భూములకు అప్పనపల్లి ఆలయ ఈఓ, కట్టుంగ ఆలయ ప్రత్యేకాధికారి వీవీవీఎస్ఎన్ మూర్తి, అప్పటి దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ ఆధ్వర్యాన 2015లో వేలం పాటలు నిర్వహించారు. 18.05 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.6.91 లక్షల ఆదాయం వచ్చింది. ఆ సొమ్ముపై విచారణ నిర్వహించి, వేలం నిర్వహించిన భూములను పాటదారులకు అప్పగిస్తామని ఈఓ కృష్ణచైతన్య చెప్పారు.

దిశ యాప్‌తో మహిళలకు పూర్తి రక్షణ

ఆలమూరు: దిశ యాప్ ద్వారా మహిళలు పూర్తి స్థాయి రక్షణ పొందవచ్చని ఎస్సై ఎస్.శివప్రసాద్ అన్నారు. మండలంలో రెండో రోజైన గురువారం కూడా దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమం జరిగింది. పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన మూడు బృందాలు కొత్తూరు, జొన్నాడ, మడికి గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో పాదచారులు, వాహనదారులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళందరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో రక్షణ పొందాలని సూచించారు. వివరాలకు ఆయా గ్రామ సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులను సంప్రదించాలని ఎస్సై శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

అంబాజీపేట: దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, తద్వారా ఆపత్కాలంలో మేలు జరుగుతుందని ఎస్సై ఎ.చైతన్య కుమార్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిశ యాప్‌పై రెండు రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్, ముక్కామల, పుల్లేటికుర్రు తదితర ప్రాంతాల్లో పలువురు వాహనచోదకుల ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి

పి.గన్నవరం: స్థానిక సెంటర్‌లో కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలను వారం రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశించారు. కాలువ వెంబడి ఆక్రమణల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న 43 మందితో గురువారం తన కార్యాలయంలో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో అందరూ సహకరించాలని కోరారు. ఆక్రమణల తొలగింపునకు వ్యాపారులు అంగీకరించారని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐ పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.